## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!

సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:352 | సోమవారం జూలై 27, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# ఎంపీ, ఎమ్మెల్యే కావడానికి 25 ఏళ్లు ఎందుకు?

## చట్టసభల పోటీకి ఏజ్ తగ్గించాలి: సీఎం రేవంత్





2లో

# 13 వేలమంది బాలికల

## థింసా నృత్యంతో మోదీకి స్వాగతం



విజయనగరం రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1న భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ సభ, ఏర్పాట్లపై మంత్రులు వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి విజయనగరంతో పాటు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ చేయాలని నిర్ణయించారు. విజయనగరంలో నియోజకవర్గాల నుంచి ఎక్కువ మందిని సమీకరించాలని సూచించారు. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు ప్రైవేటు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేయాలని మంత్రులు ఆదేశించారు. విమానాశ్రయంలో 13 వేల మంది బాలికలతో అరకు థింసా గిరిజన నృత్యంతో ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలకాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 6 వేలు, పార్వతీపురం మన్యం నుంచి 5 వేలు, పోలవరం జిల్లా నుంచి 2 వేల మంది బాలికలకు థింసా నృత్యంలో పాల్గొంటారని వివరించారు.

# బంగాళాఖాతంలో వాయుగుండం



2లో

## విషాదం.. శ్రీరాంసాగర్ జలాశయంలో ఈతకు దిగి

# ముగ్గురి మృతి



బాల్కొండ: నిజామాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ జలాశయం (ఎస్సారెస్పీ)లో ఈతకు దిగి ముగ్గురు యువకులు మృతిచెందారు. ముప్కాల్ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఈతకు దిగిన ఐదుగురు యువకులు నీటమునిగి గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురు చనిపోగా, ఒకరు గల్లంతయ్యారు. మరొకరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. మృతులు నిజామాబాద్‌కు చెందినవారిగా సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# త్వరలోనే ఆప్కో సహకార సంఘాల ఎన్నికలు


- చేనేత సంక్షేమమే ధ్యేయం
- త్వరలో ఆప్కో ఎన్నికలు
- రూ.25 వేల ఆర్థిక సాయం
- ప్రగడ కోటయ్యకు నివాళులు
- కుటుంబీకులకు ఘన సత్కారం




**చీరాల, జూలై 26 :** రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలతో పాటు ఆప్కో ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. చీరాలలోని పద్మశాలీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులైన నేతన్నలందరికీ 'నేతన్న సేవలో' పథకం కింద ఏటా రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు.

పేజి 2లో ▶

# ఆసుపత్రిలో బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు



## ఏఐజీ ఆసుపత్రిలో బాలకృష్ణ చికిత్స

- చిత్రీకరణలో గాయపడిన బాలకృష్ణ
- ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స
- ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన సీఎం చంద్రబాబు
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న సీఎం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది

హైదరాబాద్: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో పరామర్శించారు. ఇటీవల సినిమా చిత్రీకరణ సందర్భంగా ప్రమాదవశాత్తు గాయపడిన బాలకృష్ణ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రబాబు నాయుడు నేరుగా ఆసుపత్రికి వెళ్లి బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. బాలకృష్ణ త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలు, సినీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైద్య బృందం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు మంచి స్పందన ఉందని ముఖ్యమంత్రికి వివరించింది. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం ఆయన పూర్తిగా కోలుకుంటారని వైద్యులు తెలిపారు.

పేజి 2లో ▶



# నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తి అరెస్టు



2లో



# సంపాదకీయం

## భయం నీడలో మీడియా!

అప్పుడు తప్పు అన్నవాళ్లు ఇప్పుడు ఒప్పు అంటున్నారు. అప్పుడు ఒప్పు అన్నవాళ్లు ఇప్పుడు తప్పు అంటున్నారు. నాడు అన్నా హజారే ఆమరణ దీక్ష చేయగా నేడు సోనమ్ వాంగ్ చుక్ దీక్ష చేశారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం ఉండగా ఇప్పుడు నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. నాటి ప్రభుత్వం ఉద్యమకారుల డిమాండ్లకు తలొగ్గి ఉన్నత స్థానాల్లో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ బిల్లును తీసుకురాగా, నేటి ప్రభుత్వం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ విషయంలో మాత్రం తెగేదాకా లాగి, చివరకు అంగీకరించింది. అప్పుడు అన్నా హజారేకు తోడుగా నిలిచిన అరవింద్ కేజ్రీవాల్ ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీని ఏర్పాటు చేసి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎదిగి ప్రస్తుతం మాజీ సీఎంగా మిగిలారు-- ఇప్పుడు బొద్దింకల జనతా పార్టీ అని ప్రకటించుకున్న అభిజీత్ దీప్కే రేపు ఏమవుతారో తెలియదు. నీట్ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రం లీక్ అవడంతో ప్రారంభమైన ప్రస్తుత ఉద్యమం ఇప్పుడు తీవ్రమై దేశ రాజకీయాలను కుదిపేసింది. రాజకీయంగా అత్యంత బలశాలి అని అందరూ భావిస్తున్న ప్రధాని మోదీ ఒక మెట్టు దిగొచ్చి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించక తప్పలేదు. విద్యార్థుల కోసం విద్యార్థులతో ప్రారంభమైన ఈ ఉద్యమం ప్రతిపక్షాల చేతికి ఆయుధం అందించింది. అన్నా హజారే దీక్ష వల్ల లోక్‌పాల్ చట్టం వచ్చినా దేశంలో ఉన్నత స్థానాల్లో అవినీతి ఏ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు సోనమ్ వాంగ్ చుక్, అభిజీత్ దీప్కే వంటి వారి వల్ల ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినా ప్రశ్నపత్రాల లీకేజీలు

## ఆసుపత్రిలో బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

**ఏఐజీ ఆసుపత్రిలో బాలకృష్ణ చికిత్స**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**చిత్రీకరణలో గాయం**

హైదరాబాద్, జూలై 26 :
సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఇటీవల ఒక సినిమా షూటింగ్‌లో ప్రమాదవశాత్తు గాయపడిన బాలకృష్ణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు, ఆయనను నేరుగా కలిశారు.

**ఆరోగ్య పరిస్థితిపై విచారణ**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలను వైద్యులతో చర్చించారు. బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

**షూటింగ్‌లో గాయం**

సినిమా చిత్రీకరణ సమయంలో బాలకృష్ణకు అనుకోకుండా గాయమైంది. దీంతో మెరుగైన వైద్యం కోసం ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది.

**త్వరలోనే డిశ్చార్జ్**

వైద్యుల ఆధ్వర్యంలో అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆయన వేగంగా కోలుకుంటున్నారని వైద్య వర్గాలు తెలిపారు. చికిత్స పూర్తికాగానే త్వరలోనే ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది.

## ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను: సిద్ధరామయ్య

మొదటి పేజీ తరువాయి

తాను 2028 అసెంబ్లీ ఎన్నికల తో పాటు ఇకపై ఏ ఇతర ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ప్రకటించారు. రాజకీయ రంగం అవినీతిమయంగా మారిపోయిందని.. తనకూ వయసు పైబడటం, అనారోగ్య కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తనకు 79ఏళ్లని.. తన పదవీకాలం ఇంకా ఏడాదిన్నర పాటు ఉందని పేర్కొన్నారు. అప్పటికి తన వయసు 81-82 ఏళ్లకు చేరుకుంటుందన్నారు. ఆరోగ్యం బాగాలేకపోవడం వల్ల మునుపటిలా అదే ఉత్సాహంతో పనిచేయడం ఇక సాధ్యం కాదని వెల్లడించారు. అయితే ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ ప్రజల తరఫున గళం మాత్రం వినిపిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

2028 నాటికి తన రాజకీయ ప్రస్థానం 50ఏళ్లకు చేరుకుంటుందని సిద్ధరామయ్య తెలిపారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించానని.. దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలు, ఓటములు చవిచూశానని పేర్కొన్నారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించలేదన్నారు. గతంలో తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా డబ్బు సమకూర్చేవారని సిద్ధరామయ్య తెలిపారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని.. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రజలకు డబ్బు పంచాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: ప్రహ్లాద్ జోషి

కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్ణాటక సీఎం పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆర్థిక సహాయం.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



కష్టకాలంలో ఉన్న పార్టీ కార్యకర్త కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అండగా నిలిచారు. ద్వారకాతిరుమల మండలం ఐ.ఎస్. రాఘవాపురం గ్రామానికి చెందిన రాజులపాటి రామకృష్ణ తాడి చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలతో మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఇటీవలే వారిని పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఆదివారం మండల బీసీ నాయకుల ద్వారా ఏఎంసీ వైస్ చైర్మన్ పోతన ధర్మరాజు చేతుల మీదుగా ఆ సొమ్మును బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు రామకృష్ణ కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, మండల బీసీ నాయకులు కంపసాటి రామకృష్ణ, యార్లగడ్డ శివాజీ, సత్యనారాయణ, గ్రామ టీడీపీ అధ్యక్షులు జిలుగుల సిద్ధారావు, గ్రామ పార్టీ నాయకులు బోడపాటి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకాతిరుమలలో అంగరంగ వైభవంగా శ్రీ గంగానమ్మ అమ్మవారికి ఆషాఢమాస సారే సమర్పణ.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ద్వారకాతిరుమల గ్రామం తూర్పు వీధిలో కొలువైయున్న శ్రీ గంగానమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలతో సారే సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పాదాల చెంత నుండి మహిళా భక్తులు మంగళవాయిద్యాలు, సన్నాయిమేళాల నడుమ క్షేత్ర పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ వేడుకలో భక్తులు అమ్మవారికి ప్రీతికరమైన పసుపు, కుంకుమ, నూతన చీరలతో పాటు వివిధ రకాల స్వీట్లు, పండ్లను సారే రూపంలో భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ముటుకూరు జడ్పీ హైస్కూల్ లో జరిగిన పేరెంట్స్- టీచర్స్ ఆత్మీయ సమావేశం

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, దుర్గి మండలం, జూలై 26;**



ఏపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేరెంట్స్ – టీచర్స్ ఆత్మీయ సమావేశంను పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమానికి దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, టీచర్స్, కుక్కమూడి ప్రసాద్, మరియదాసు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## త్వరలోనే ఆప్కో సహకార సంఘాల ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

**నేతన్నలకు విస్తృత సంక్షేమం**

కూటమి ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి పేర్కొన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పింఛను ఇస్తున్నామని, మగ్గం నేసేవారికి 200 యూనిట్లు, మరమగ్గం వారికి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు.

**ప్రగడ కోటయ్య స్ఫూర్తి**

చేనేత రంగానికి ప్రగడ కోటయ్య చేసిన సేవలు అనన్యమైనవని, ఆయన స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి అన్నారు. అమరావతిలో రూ.10 కోట్లతో ప్రగడ కోటయ్య స్మృతివనం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం నేతన్నలను మోసం చేసిందని, అర్హత లేని వారికి నిధులు మళ్లించిందని విమర్శించారు.

**కుటుంబ సభ్యులకు సత్కారం**

కార్యక్రమంలో భాగంగా ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఉన్నతాధికారులు ఆర్పీ సిసోడియా, రేఖారాణి, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యే కావడానికి 25 ఏళ్లు ఎందుకు? చట్టసభల పోటీకి ఏజ్ తగ్గించాలి: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

దేశ రాజకీయాలో యువత పాత్ర మరింత క్రియాశీలకంగా మారాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థుల కనిష్ట వయోపరిమితిని ప్రస్తుతమున్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని ఆయన అన్నారు.

21 ఏళ్ల వయస్సులోనే యువత సివిల్ సర్వెంట్ అధికారులుగా దేశాన్ని పాలిస్తున్నప్పుడు.. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికి మాత్రం 25 ఏండ్లు ఎందుకు ఉండాలని ఆయన ప్రశ్నించారు. పరిపాలనలో యువతకు పెద్దపీట వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదనపై భవిష్యత్ కార్యాచరణను కూడా ఆయన ప్రకటించారు . రాబోయే ఆగస్టు నెలలో శాసనసభలో దీనిపై ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఈ ప్రతిపాదనను వివరిస్తానని, కూటమి పార్టీలన్నింటినీ త్వరలో కలుస్తానని వెల్లడించారు.

ఇదే వేదికగా దేశంలో నిరుద్యోగులను వేధిస్తున్న పేపర్ లీకేజీల అంశంపై కూడా సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ తీవ్రంగా దెబ్బతింటోందని, వీటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రశ్నించిన ప్రతిపక్షాలపై ఈడీల ద్వారా వేధించారని, అయితే యువత ఐక్యంగా పోరాడితే కేంద్రం సైతం తలవంచక తప్పదని ఆయన హెచ్చరించారు.

## మల్లన్న దర్శనానికి ఇక సులభంగా.. కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్ ప్రారంభం



కొమురవెల్లి: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్‌ను కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని చెప్పారు.

**తీరనున్న భక్తుల ఇబ్బందులు**

మల్లన్న భక్తులు కొమురవెల్లి చేరుకునేందుకు ప్రస్తుతం బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో వచ్చే భక్తులు రాజీవ్ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న కొమురవెల్లికి చేరుకోవడానికి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. రోడ్డు ప్రయాణం ద్వారా హైదరాబాద్ నుంచి సుమారు 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ రెండు మూడు వాహనాలు మారాల్సి వస్తోంది. చేర్యాల, మద్దూరు, ధూళ్మిట్ట మండలాల ప్రజలకు సైతం రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. చదువుల కోసం వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు నిత్యం సుమారు 100 నుంచి 200 మంది వెళ్తుంటారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారికి ఒక్కొక్కరికి సుమారు రూ.100 నుంచి రూ.200, కరీంనగర్ నుంచైతే రూ.100- 150 ఖర్చు తప్పదు. రైలు ప్రయాణమైతే సగం ఖర్చు భారం తగ్గుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిలుపుదల చేసే రైళ్ల వివరాలు..**

సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు నడుస్తున్న 4 డెమూ రైళ్లకు ప్రతి రోజూ ఈ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించారు.

సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వచ్చే 77654 డెమూ రైలు బుధవారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 2:38 గంటలకు.. 77656 డెమూ రైలు గురువారం మినహా ప్రతి రోజూ ఉదయం 6:45 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది.

## బంగాళాఖాతంలో వాయుగుండం

మొదటి పేజీ తరువాయి

అమరావతి: వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55-65 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశముందని వివరించింది. సముద్రం అలజడిగా ఉంటుందని.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తి అరెస్టు

మొదటి పేజీ తరువాయి

ప్రొద్దుటూరు నేరవార్తలు: కడప జిల్లా ప్రొద్దుటూరులో నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి బంగారం పూతతో ఉన్న రంగు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూకృష్ణ మీడియాకు వెల్లడించారు. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం వినాయకపురానికి చెందిన కన్నయ్య తక్కువ ధరకే బంగారం తయారు చేయిస్తానని నమ్మబలికాడు. దీంతో ప్రొద్దుటూరుకు చెందిన రవికుమార్ బంగారం కోసం కన్నయ్యకు విడతల వారీగా రూ.6.50 లక్షలు చెల్లించాడు. కొన్ని రోజుల తర్వాత కన్నయ్య.. రవికుమార్‌కు బంగారం పేరిట నాలుగు కడ్డీలు ఇచ్చాడు. అనుమానం వచ్చిన రవికుమార్ వాటి నాణ్యతను పరీక్షించగా అవి నకిలీవని తేలింది. మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఎన్ హెచ్ 716 రహదారి పైన జరుగుతున్న యాక్సిడెంట్లకు కారకులు ఎవరు ..!!?

మొదటి పేజీ తరువాయి

- **ఎన్.హెచ్ 716 పిఆర్ .. ఆర్టీవో.. లోకల్ ప్రజా నాయకుడు... పైన వాహనదారులు, స్టేషన్లో కంప్లైంట్ చేయాలి అంటున్న మేధావులు..!!?**
- **పర్మిషన్లకు మించి 2 నుండి 3 ఇంతలు లోడ్ ఎక్కువ ఏసుకుని తిరుగుతున్న వాహనాల్ని...!! ఆఫీసర్లు "తాయిలాలు" తీసుకుని అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వ శాఖలు... గుసగుసలు పడుతున్న ప్రజలు..!?**
- **సీతారాంపేట బ్రిడ్జిపై మరో ప్రమాదం... నిద్రపోతున్న నేషనల్ హైవే అధికారులు..!!**
- **గుంతలతో ప్రమాదాల వలయం.. మరోసారి రెండు లారీలు ఢీ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజల డిమాండ్..!!**

**తిరుపతి జిల్లా ఇన్చార్జిన్ న్యూస్ జూలై 26 జన సముద్రం న్యూస్**

కడప--చెన్నై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-716)లో తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం సీతారాంపేట బ్రిడ్జి మరోసారి ప్రమాదానికి వేదికైంది... బ్రిడ్జిపై రహదారి పూర్తిగా దెబ్బతినడం, భారీ గుంతలు ఏర్పడటంతో ముందుగా వెళ్తున్న లారీ వేగం తగ్గించగా, వెనుక నుంచి వచ్చిన మరో లారీ బలంగా ఢీకొట్టింది... ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోయినా రెండు లారీల ముందు భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు వచ్చి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు...

స్థానికుల కథనం ప్రకారం, సీతారాంపేట బ్రిడ్జిపై రహదారి చాలా కాలంగా గుంతలతో నిండిపోయింది. ఈ గుంతల కారణంగా ప్రతి వాహనం వేగం తగ్గించాల్సి వస్తోంది. అయితే వెనుక నుంచి వచ్చే వాహనాలు సమయానికి నియంత్రించలేక తరచూ ఢీకొంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి

ఇటీవల ఇదే బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అయినప్పటికీ నేషనల్ హైవే అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం ఎన్ హెచ్716 రోడ్డు మరమ్మత్తులకి సెంట్రల్ గవర్నమెంట్ నుండి అనేక కోట్ల రూపాయలు శాంక్షన్ చేసుకొని మరమ్మత్తులు చేయకుండా ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు... లోకల్ రాజకీయ నాయకులకు పట్టదా..!! మీ నియోజకవర్గంలో జరుగుతున్న యాక్సిడెంట్లు పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని ప్రజలు మండిపడుతున్నారు...దినపత్రికలలో , సోషల్ మీడియాలో ఎన్ని మార్లు ప్రచురణ అయిన కూడా చెల్లించని నేషనల్ హైవే అథారిటీ వారు... సామాన్య ప్రజల ప్రాణాలు అంటే అంత చులకన తిరుపతి జిల్లా ఆర్టీవో వారు చెప్పాలి.. అధికారులు లంచాలకు పాల్పడి అమాయక ప్రజలు జీవితాలతో ఆడుకుంటున్నారంటూ స్థానిక ప్రజలు వాహనదారులు వాపోయారు..

కడప--తిరుపతి--చెన్నై మార్గం రాష్ట్రంలో అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారుల్లో ఒకటి... ప్రతిరోజూ వేలాది కార్లు, లారీలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. ఇలాంటి కీలక రహదారిపై ప్రమాదకర స్థితిలో ఉన్న బ్రిడ్జిని నిర్లక్ష్యం చేయడం వల్ల సామాన్య ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. కలెక్టర్ సారు అధికారులని ఇప్పటికైనా నిద్రలేపి రహదారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజలు, మేధావులు చెప్పుకొస్తున్నారు..

# ప్రగడ కోటయ్య ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

- చేనేత, రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రగడ కోటయ్య
- ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయం
- డీఆర్వో విజయకుమార్

**నెల్లూరు, జూలై 26: జన సముద్రం జిల్లా ప్రతినిధి.**





చేనేత కార్మికులు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాంతం అంకితభావంతో పనిచేసిన మహనీయుడు ప్రగడ కోటయ్య అని, వారి ఆశయాలను భావితరాలకు చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఆర్వో విజయకుమార్ అన్నారు. ప్రగడ కోటయ్య జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతు.. గుంటూరు జిల్లా నిడుబ్రోలులో ప్రగడ వీరభద్రుడు, కోటమ్మ దంపతులకు 1915 జూలై 26న జన్మించిన ప్రగడ కోటయ్య తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. 1935లో మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టి, సర్కారు జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు.సహకార సంఘాల ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో చేనేత కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి, రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల సదస్సులు నిర్వహించడం ద్వారా మరిన్ని సహకార సంఘాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించారని చెప్పారు. 1942 నుంచి మద్రాసు, ఆంధ్ర రాష్ట్రాల హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా, 1945లో నాగ్‌పూర్‌లో ఏర్పాటైన అఖిల భారత హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తూ చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మద్రాసులో 75 రోజుల పాటు, ఆంధ్రలో 20 రోజుల పాటు సత్యాగ్రహ ఉద్యమాలకు నాయకత్వం వహించారని, ఈ పోరాటాల కారణంగా అరెస్టులు, కోర్టు శిక్షలను కూడా ఎదుర్కొన్నారని వివరించారు.ప్రజాప్రతినిధిగా కూడా ప్రగడ కోటయ్య విశేష సేవలందించారని డీఆర్వో తెలిపారు. 1952 నుంచి 1962 వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం, అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యునిగా పనిచేయడంతో పాటు, 1967 నుంచి 1972 వరకు తిరిగి ఎమ్మెల్యేగా, 1974 నుంచి 1980 వరకు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా సేవలందించారని చెప్పారు. ఈ కాలంలో పలు శాసనసభ ఉపసంఘాలు, రాష్ట్ర డ్రైనేజ్ బోర్డు, జిల్లా నీటిపారుదల కమిటీలలో సభ్యునిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. 1954లో రొంపేరు అభివృద్ధి కమిటీని స్థాపించి, రొంపేరు డ్రెయిన్ పరిధిలోని సుమారు 16 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయించడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. అలాగే చీరాల ప్రాంతంలోని రొంపేరు భూములకు సాగునీటి సౌకర్యాలు కల్పించడం, తోటవారిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అమలుకు కృషి చేయడం ద్వారా వేలాది మంది నిరుపేద రైతుల ఆర్థికాభివృద్ధికి విశేషంగా దోహదపడ్డారని వివరించారు.నిరాడంబర జీవనం, నిస్వార్థ ప్రజాసేవ, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ప్రగడ కోటయ్య వంటి మహనీయుల జీవితాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి సేవలను స్మరించుకుంటూ, ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు.మాజీ ఎమ్మెల్సీ ఛుదాటి రాధయ్య మాట్లాడుతూ ప్రగడ కోటయ్య యుక్తవయస్సు నుంచే చేనేత, వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీతో సన్నిహిత పరిచయం ఉండటంతో, ఆయన పోరాట పటిమను గుర్తించిన అప్పటి ప్రభుత్వం రాజ్యసభకు ఎంపిక చేసిందన్నారు. చేనేత రంగం వెనుకబాటుతనానికి పవర్‌లూమ్ వ్యవస్థే ప్రధాన కారణమని కోటయ్య తీవ్రంగా వ్యతిరేకించారని, ఆ అంశంలో తాను మొదట విభేదించినప్పటికీ, ఆయన చేసిన ఉద్యమాలు తనను ప్రభావితం చేసి తరువాత చేనేత రంగంలో కలిసి పనిచేసే అవకాశం కలిగిందని చెప్పారు. చేనేత కార్మికులకే పరిమితం కాకుండా వ్యవసాయ కార్మికుల కోసం కూడా భూ పోరాటాలు నిర్వహించి, వారికి భూములు దక్కేలా చేయడంలో విజయవంతమైన నాయకుడిగా కోటయ్య నిలిచారని కొనియాడారు.కార్యక్రమంలో నేతన్నలు బైన ఏడుకొండల (పాటూరు), పొనగంటి సింహబలుడు నారాయణరెడ్డి, కుండా సుబ్బారావును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి దావులూరి ఐజయ్య, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, ఆంధ్ర ప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తల్లా రసింహ స్వామి, రాష్ట్ర చేనేత సంఘాల నాయకులు కె.వి.శేషయ్య, కాటికాల వెంకటేశ్వర్లు, బి. బాలాజీ, జె. రామ సుబ్బయ్య, ఇతర చేనేత నాయకులు, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదే లక్ష్యం.. కాంగ్రెస్ పార్టీ నిరంతర పర్యవేక్షణ

- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాణా ప్రతాప్ రాథోడ్.
- బూత్‌ల వారీగా సర్వే పురోగతిని సమీక్షించి అవసరమైన సూచనలు చేసిన కాంగ్రెస్ నాయకులు

**జనసముద్రం -- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూలై 26:**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధుల పనితీరును పినపాక నియోజకవర్గ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాణా ప్రతాప్ రాథోడ్, పినపాక నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి సమన్వయకర్త గాదె కేశవరెడ్డి పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా కరకగూడెం మండలంలోని ముప్పై, ముప్పై మూడు, ముప్పై నాలుగు, నలభై బూత్‌లను సందర్శించి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్వే ప్రక్రియ, దరఖాస్తు పత్రాల సేకరణ, ఓటర్ల నమోదు పురోగతి, బూత్ స్థాయి ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఇంటికి చేరుకొని దరఖాస్తు పత్రాల నమోదును వేగవంతం చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ సర్వేను పూర్తి చేయాలని బూత్ స్థాయి ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులకు సూచించారు.అనంతరం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో తమ విధులను సమర్థవంతంగా నిర్వహించిన బూత్ స్థాయి అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎన్నికల సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్, కార్యవర్గ సభ్యుడు నాగబండి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు చౌలం కేశవరావు, కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత, తాటిగూడెం ఉపసర్పంచ్ గాంధర్ల రామనాథం, మండల నాయకులు షేక్ రఫీ, గొగ్గలి రవి, జలగం కృష్ణ, పోలేబోయిన సీతారాం బాబు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండ జిల్లా డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడిగా గోలి రాజేశ్వర్‌రావు

- ఎల్కతుర్తి మండలంలో కాంగ్రెస్ శ్రేణుల హర్షం

**ఎల్కతుర్తి, జూలై 26(జనసముద్రం)**



హన్మకొండ జిల్లా డీసీసీ (డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ) ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడిగా ఎల్కతుర్తి మండలానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన గోలి రాజేశ్వర్‌రావు పార్టీ బలోపేతానికి అంకితభావంతో సేవలందించారని, ఆయన కృషిని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఈ కీలక బాధ్యతను అప్పగించడం మండలానికి గౌరవకారణమని నాయకులు పేర్కొన్నారు.చిన్నా--పెద్దా అనే తేడా లేకుండా అందరితో ఆప్యాయంగా మెలుగుతూ, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగే నాయకుడిగా గోలి రాజేశ్వర్‌రావుకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.విద్యావేత్తగా, ప్రజానాయకుడిగా ఆయన విశిష్ట సేవలు అందించారని కొనియాడారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, హన్మకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాం రెడ్డి, పీసీసీ సభ్యుడు అశోక్ రెడ్డిలకు గోలి రాజేశ్వర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్‌గా, అనంతరం పరకాల నియోజకవర్గ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన ఆయన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.భవిష్యత్తులో గోలి రాజేశ్వర్‌రావు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి పార్టీకి, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# భారీ టేకు వృక్షాల నరికివేత పట్టించుకోని అటవీశాఖ అధికారులు

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి కానాపూర్ నియోజకవర్గం ఇన్చార్జ్**



జూలై 26 మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని కవ్వాల అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా గుర్తుతెలియని దుండగులు రంపల సహాయంతో బారి టేకు వృక్షాలను దొంగలిస్తున్నప్పటికీ అటవీశాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని జన్నారం మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక తీసుకు రావడానికి ట్రాక్టర్లతో వెళ్లి తీసుకువస్తుంటే తక్షణమే ఇన్ఫర్మేషన్ పేర్లతో వాటిని టార్గెట్ చేసి వాటిపై కేసులు పెడుతూ బెదిరింపులకు గురి చేసే అటవీశాఖ అధికారులు ఎందుకు కవ్వాల్ అటవీ ప్రాంతంలో ఇంత భారీ టేకు వృక్షాలను రంపల సహాయంతో కోసుకు వెళ్తున్న దుండగులను ఎందుకు పట్టుకోవడంలో విఫలం అయితున్నారు అని తెలిసి రావడం లేదని వారు అంటున్నారు ఇసుక పైన ఉన్న మమకారం భారీ టేకు వృక్షాల పైన ఎందుకు లేకుండా అటవీ అధికారులకు పోతుందో తెలియడం లేదు అటవీశాఖ అధికారులకు దుండగులకు ఏమన్నా చేతివాటం ఉందేమో అనే కోణంలో జన్నారం మండల ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు తక్షణమే ఏ ప్రాంతంలో అయితే భారీ టేకు వృక్షాలు నరికివేతకు గురయ్యాయో అక్కడ పనిచేసే ఎఫ్ బి ఓ ఎఫ్ ఎస్ ఓ ల పై అధికారులు తక్షణమే సిసిఎఫ్. ఎఫ్ డి పి టి. డి ఎఫ్ ఓ . వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను జన్నారం మండల ప్రజలు కోరుతున్నారు

# కోహెడలో పోచమ్మ బోనాలు



**జన సముద్రం న్యూస్ కోహెడ జూలై 26:**
( కోహెడ ప్రసాదరావు)

సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో పోచమ్మ బోనాల వేడుకలు ఆదివారం మాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగాను వైభవంగాను జరిగాయి. స్థానిక సర్పంచ్ బందెల సుజాత స్వయంగా తలపై బోనం పెట్టుకొని తన కుల బాంధవులతో ఊరేగింపుగా వెళ్లారు. ఆషాడమాసంలో పోచమ్మ తల్లికి బోనం మొక్కు సమర్పించడంలో భాగంగా ఈ ఉత్సవాల్ని నిర్వహించుకున్నట్లు సర్పంచ్ బందెల సుజాత- బాలకిషన్ తెలిపారు. వర్షాలు కురిసి, ప్రజలెల్లరు పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించి పూజలు గావించినట్లు అనంతరం బోనం మొక్కును సమర్పించినట్లు వివరించారు. పోచమ్మ బోనాల అనంతరం గ్రామంలో వర్షం పడడంతో పోచమ్మ తల్లి అనుగ్రహించిందని సంతోషం కనబరిచారు. బోనాల వేడుకలలో మాల సంఘం అధ్యక్షులు ప్రతినిధులు కుల బాంధవులు మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా తుమ్మారి పదవి వీడ్కోలు

**జనసముద్రం న్యూస్ కోహెడ జూలై 26: (కోహెడ ప్రసాదరావు)**



హనుమకొండ జిల్లా కేంద్రంలోని పి ఆర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జూనియర్ లెక్చరర్ డాక్టర్ తుమ్మారి శరత్ బాబు ఉద్యోగ విరమణ వీడ్కోలు, జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తుమ్మారు శరత్ బాబు జూనియర్ లెక్చరర్ గా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్ గా విధులు నిర్వహించారు. కోహెడలో పనిచేసిన సమయం లో డాక్టరేట్ పట్టాను పొందారు .సహజంగా వీరు కవిగా అనువాదకులుగా చాలా పేరు గడించినారు.
సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల సెక్రటరీగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో స్వేరోస్ అంతర్గత పత్రిక సంపాదకులుగా శరత్ పనిచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ దామోదర్, అసోసియేట్ ప్రొఫెసర్ దినకర్, శరత్ బాబు సోదరులు దామోదర్, లక్ష్మణరావు సహృదయ సంస్థ బాధ్యులు వనం కాంతారావు ప్రముఖ న్యాయవాది చల్లేటి రామకృష్ణ గ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సూపరింటెండెంట్ రామక రవీందర్ పలువురు సాహితీ అభిమానులు బంధుమిత్రులు ఆంగ్లోపాధ్యాయులు హాజరైనారు. ఈ సందర్భంగా ఆంగ్లంలో అనువాదం చేసిన ఆంక్లెట్స్ మువ్వలు అను పుస్తకాన్ని ఆవిష్కరింప చేయడం జరిగింది. తదనంతరం తుమ్మారి శరత్ బాబు దంపతులను ఘనంగా సన్మానించారు.

# రైతుల సుభిక్షం కోసం చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో వరుణ రుద్రహోమం

- ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో

**హనుమకొండ, జూలై 26(జనసముద్రం)**



వరుణ యాగం లో గంగు మణికంఠ శర్మతో పండితులు

దేశానికి వెన్నెముకైన రైతులు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ హనుమకొండలోని చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామి (వేయి స్తంభాల) దేవాలయంలో ఆదివారం ఆషాఢ శుద్ధ ద్వాదశి సందర్భంగా వైభవంగా వరుణ రుద్రహోమం నిర్వహించారు.గత రెండు రోజులుగా కొనసాగిన వరుణ జపం, ఋష్యశృంగ పారాయణం సమాప్తి అనంతరం యాగశాలలో గణపతి, నవగ్రహ, రుద్ర, జయాది మూలమంత్రాలతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు.అన్నదాతలైన రైతుల బాధలు తొలగి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, పశు పక్ష్యాదులు, ప్రకృతి సుభిక్షంగా ఉండాలని వేదపండితులు ప్రార్థనలు చేశారు.వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలగాలని, చెట్లు, పక్షులు, జంతువులు, పంచభూతాల పరిరక్షణ కోసం వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.ఈ సందర్భంగా లలితా సహస్రనామ భాష్యంలోని భావాన్ని వివరిస్తూ, “కష్టాలను మేఘాలుగా భావిస్తే వాటి చివర మెరిసే వెండి అంచులా ఆశ, ధైర్యం మనిషికి దివ్యకాంతిని ప్రసాదిస్తాయి” అని వేదపండితులు పేర్కొన్నారు.లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీ రుద్రేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, వేదపండితులు గంగు మణికంఠ అవధాని, మఠం ప్రణవ్, పానుగంటి సాయి తేజ, చెరుకుపల్లి శ్రీవత్సవాచార్యులు, శ్రీమాన్ నారాయణాచార్యులు, రేవన్, అక్షయ్, ఆలయ ఈవో అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

**వెల్దండ,జూలై,27(జనసముద్రం న్యూస్)**



నిరుపేద ప్రజల కోసమే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నమని యెన్నమ్స్ చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాత బ్యాంక్ దగ్గర యెన్నమ్స్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని యెన్నమ్స్ చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు...మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు.
ఈ శిబిరంలో దాదాపు 550 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో మరియు థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యెన్నం భూపతి రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ యెన్నం అంజన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఎముకల డాక్టర్ వెంకటేష్, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు,జనరల్ మెడిసిన్ దినేష్ కుమార్, స్త్రీల ప్రతేక వైద్యురాలు శ్రీవాస్తవి, డీఎంఓ అభిషేక్, జనరల్ మేనేజర్ కె రవి కుమార్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్,వార్డు మెంబర్స్, నాయకులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, గుద్దటి కిష్టల్, మారేపల్లి శ్రీనివాస్, మసిగుండ్ల వెంకటేష్, మట్ట భరత్ గౌడ్, జంగిలి ఆనంద్ రాజ్, గోరటి భరత్, సమీర్, శేఖర్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

## - ఒంటిమిట్ట పార్టీ శ్రేణులకు చమర్తి పిలుపు ....

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూలై 26:**



ఆదివారం స్థానిక నియోజకవర్గం పార్టీ ఒంటిమిట్ట మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులతో నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రేపటి నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విజయవంతంగా పూర్తి చేయాలని జగన్ మోహన్ రాజు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ఒంటిమిట్ట పార్టీ ముఖ్య నాయకులు ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి క్లస్టర్ ఇంచార్జి తుమ్మలగుంట ఈశ్వరయ్య ఆలూరి వెంకటసుబ్బయ్య బొబ్బిలి రాయుడు నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్వీ రమణ బాలమునయ్య పొట్టేటి రాజారెడ్డి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎంఏ తెలుగు మూడో సెమిస్టర్ తరగతులు 27 నుంచి ప్రారంభం

- విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలి : డాక్టర్ గడ్డం వెంకన్న

**హనుమకొండ జూలై 25(జనసముద్రం)**



వరంగల్ హంటర్ రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2026--2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు రెండో సంవత్సరం మూడో సెమిస్టర్ తరగతులు ఈ నెల 27వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.ఈ విషయాన్ని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మూడో సెమిస్టర్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులందరూ మొదటి రోజు నుంచే తరగతులకు తప్పనిసరిగా హాజరై విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని కోరారు.

# ఎల్కతుర్తిలో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

**•గీతన్నల చైతన్య యాత్రకు భారీగా తరలిరావాలి: జనగాని లక్ష్మీనారాయణ గౌడ్**



**ఎల్కతుర్తి, జూలై 26 (జనసముద్రం)**
గీత కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న గీతన్నల చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) మండల అధ్యక్షుడు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు.ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గౌడ సంఘ భవనంలో మండల అధ్యక్షుడు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘ సమావేశంలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు దూలం ప్రభాకర్, మండల అధ్యక్షుడు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీపతి సదానందం, ప్రధాన కార్యదర్శి బత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. గీత కార్మికుల పెన్షన్‌ను రూ.4 వేలకు, ప్రమాద బీమా ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచుతామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు.వృత్తి నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులు కూడా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.నీరా, తాటి, ఈత ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గీత కార్మికుడికి కాటమయ్య రక్షణ కవచం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న గీతన్నల చైతన్య బస్సు యాత్ర ఆగస్టు 2న మహబూబాబాద్ (మానుకోట)లో ప్రారంభమై ఆగస్టు 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ముగుస్తుందని తెలిపారు.హనుమకొండ జిల్లాలో ఈ యాత్ర ఆగస్టు 15న భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి ప్రారంభమై ఎల్కతుర్తి, హసన్‌పర్తి మండలాల మీదుగా భూపాలపల్లి జిల్లాకు చేరుకుంటుందని, అనంతరం ఆగస్టు 17న ధర్మసాగర్, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల్లో కొనసాగుతుందని వివరించారు.గీత కార్మికుల సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు ఉద్యమంలో సేవలందించి అమరులైన కార్మికులను స్మరించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గీత కార్మికులు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం గౌరవ సలహాదారు గోడిశాల యాదగిరి గౌడ్, డైరెక్టర్ శ్రీపతి బిక్షపతి గౌడ్, ఎల్కతుర్తి గౌడ సంఘం అధ్యక్షుడు గోడిశాల కుమారస్వామి, ఉపాధ్యక్షుడు గోడిశాల రాజేష్, కార్యదర్శి శ్రీపతి సదానందం, జర్నలిస్ట్ జనగాని ప్రవీణ్ గౌడ్, డైరెక్టర్లు కందాల మొగిలి, విక్రమ్ గౌడ్, కొత్తకొండ కుమార్, గోడిశాల సుమన్, కొత్తకొండ శ్రీకాంత్‌తో పాటు పెద్ద సంఖ్యలో గీత కార్మికులు పాల్గొన్నారు.

# సౌత్ మోపూరు పెద్దదిక్కును కోల్పోయింది మంత్రి నారాయణ

**నెల్లూరు, జూలై 26: జన సముద్రం జిల్లా ప్రతినిధి.**



భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పముజుల దశరథ రామయ్య మృతి పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో ప్రజల సందర్శనకోసం ఉంచిన పముజుల దశరథ రామయ్య భౌతిక కాయాన్ని ఆదివారం మంత్రి నారాయణ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, పముజుల దశరథ రామయ్య మృతి నెల్లూరు జిల్లాకు తీరని లోటని అన్నారు. సుమారు 40 సంవత్సరాల పాటు సౌత్ మోపూరు గ్రామానికి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా సేవలందించి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.పేదల పక్షాన నిలబడి భూ పోరాటాల్లో తనదైన పాత్ర పోషించారని, సామాన్య కార్యకర్తగా సీపీఐలో ప్రస్థానం ప్రారంభించి ప్రజానాయకుడిగా ఎదిగిన అరుదైన వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.పముజుల దశరథ రామయ్య మృతితో సౌత్ మోపూరు గ్రామం పెద్దదిక్కును కోల్పోయిందన్నారు.. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారికి భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.మంత్రితో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ,సిటీ టీడీపీ నేతలు పముజులకు నివాళులు అర్పించారు

# టెట్ మెటీరియల్‌లో హిందూ ధర్మాన్ని కించపరిచే అంశాలు వెంటనే తొలగించాలి

**•రూపకల్పన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలి**



**రాయచోటి జనసముద్రం న్యూస్ జులై 26**
ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం ఈరోజు రాయచోటి లోని స్థానిక కార్యాలయం నందు జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మరియు జిల్లా అధ్యక్షులు ఎం నరసింహులు మాట్లాడుతూ
2026 టెట్ లాంగ్వేజ్--1 తెలుగు మెటీరియల్‌లో హిందూ ధర్మం, హిందూ సంస్కృతి, హిందూ ఇతిహాసాల్లోని మహనీయ మహిళలను కించపరిచే విధంగా ఉన్న అంశాలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం పేర్కొంటోంది.
ఉపాధ్యాయుల కోసం రూపొందించే టెట్ మెటీరియల్‌లో విద్యా ప్రమాణాలకు బదులుగా ఒక నిర్దిష్ట భావజాలాన్ని ప్రతిబింబించేలా హిందూ విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆదర్శ పాత్రలను అవమానించే వ్యాఖ్యలు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరం. ఇటువంటి రచనలు హిందూ సమాజం మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తాయి.
అభ్యంతరకరమైన పేరాగ్రాఫ్‌లను వెంటనే తొలగించి, ఈ అంశంపై యూ టీ ఫ్ ప్రజలకు, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని అపస్ డిమాండ్ చేస్తోంది.
జిల్లా సహాధ్యక్షులు జి నాగేంద్రబాబు ఉపాధ్యక్షులు ఆర్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ
అలాగే, పాఠశాల విద్యాశాఖ ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి మొత్తం టెట్ అధ్యయన మెటీరియల్‌ను సమగ్రంగా సమీక్షించి, హిందూ ధర్మం, హిందూ దేవతలు, హిందూ సంస్కృతిని అవమానించే లేదా మనోభావాలను దెబ్బతీసే అంశాలపై ప్రత్యేక విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి అంశాలు పునరావృతం కాకుండా కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరుతోంది.
విద్యా మెటీరియల్‌ను ఏ విధమైన సైద్ధాంతిక ప్రచారానికి వేదికగా మార్చకుండా, విద్యా విలువలు, భారతీయ సంస్కృతి, రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను పరిరక్షించే విధంగా రూపొందించాలని అపస్ అభిప్రాయపడుతోంది. లేనిపక్షంలో ఉపాధ్యాయులు అందరినీ కలుపుకుని, సామాజిక సంస్థలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం హెచ్చరిస్తోంది. ఈ కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్ సంబేపల్లి మండలాధ్యక్షుడు వెంకటయ్య అపస్ నాయకులు మధుసూదన్ శ్రీనివాసులు

# విచ్చలవిడిగా బెల్లం అమ్మకాలు..!

**రంగారెడ్డి జిల్లా న్యూస్ (జూలై 26)జనసముద్రం**

**•పట్టించుకోని మహేశ్వరం, ఆమనగల్ ఎక్సైజ్ అధికారులు..!**

**•మామూళ్ల మత్తులో అధికారులు..?**

మహేశ్వరం, ఆమనగల్ అబ్కారి కార్యాలయల పరిధిలో బెల్లం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ మద్యం (నాటు సారా) తయారీలో ఉపయోగించే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బెల్లం భారీ ఎత్తున నిల్వ చేసి విక్రయిస్తున్నా అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని, దీంతో అక్రమ వ్యాపారాలకు అవకాశం కలుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ వ్యవహారంలో కొందరు అధికారులు మామూళ్లు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.
ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, అక్రమ బెల్లం విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రామాయణం మానవ విలువలకు దిక్సూచి: బ్రహ్మశ్రీ వంగల సోమయాజులు

**హనుమకొండ, జూలై 26(జనసముద్రం)**
తెలుగు సంస్కృతిలో రామాయణం మానవ విలువలను, ధర్మమార్గాన్ని చూపే ఆదర్శవంతమైన ఇతిహాసంగా ఖ్యాతి గాంచిందని, భారతీయ వాంగ్మయంలో ఆదికావ్యంగా సుప్రసిద్ధి పొందిందని ప్రవచనకర్త, పౌరాణిక శిరోమణి బ్రహ్మశ్రీ వంగల సోమయాజులు అన్నారు.హనుమకొండ వడ్డేపల్లి జవహర్ కాలనీలోని ఎస్‌వీఎస్ హోమ్స్ కమ్యూనిటీ హాలులో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న "సంపూర్ణ శ్రీమద్రామాయణం" ప్రవచనమాలికలో ఆయన మాట్లాడారు.రామాయణం ఎన్ని యుగాలు గడిచినా ఆధునిక జీవన విధానానికి అన్వయించే మహోన్నత గ్రంథమని, మానవ విలువల




పరిరక్షణకు, సోదర ప్రేమకు, భక్తి భావానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ధర్మం, త్యాగం, కర్తవ్యనిర్వహణ వంటి గొప్ప విలువలను మానవాళికి బోధించే దిక్సూచిగా రామాయణం నిలిచిందన్నారు.సీతారాముల ఆదర్శ జీవితం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమైందని, అందువల్లనే నేటికీ వారి పేర్లను ఆదర్శంగా స్వీకరిస్తూ సీతారాముల కళ్యాణాన్ని తరతరాలుగా ఉత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక, ధార్మిక, నైతిక విలువలను ఆవిష్కరించిన అద్భుత కావ్యంగా రామాయణం నిలిచిందని, అందులోని పరమార్థాన్ని శ్రోతలకు విశ్లేషణాత్మకంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సీహెచ్. సుందరాచార్యులు, ఫోరం కన్వీనర్ జి. మధుసూదన్ రెడ్డి, కో-కన్వీనర్ యోగానందచారి, నరసింహమూర్తి, సంజీవరావు దంపతులు, కె. శ్రీనివాస్, ఎం. కొమురయ్య దంపతులు, వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుండవరం విధుమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ముత్తుకూరు గేట్ సుందరీకరణకు మంత్రి నారాయణ ఆదేశం





**•ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన మంత్రి**

**•ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం మంత్రి**

**నెల్లూరు, జూలై 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
నెల్లూరు నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దే దిశగా ముత్తుకూరు గేట్ సెంటర్‌లోని సర్వేపల్లి కాలువ వద్దున ఉన్న స్థలాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. ఆ ప్రాంతాన్ని బ్యూటిఫికేషన్ ద్వారా సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వీఆర్‌సీ మైదానంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.తర్వాత సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో రూ.3.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం ఈఓ ఉషారాణి, పాలకమండలి చైర్మన్ మహేష్, కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకు ఐడీ కార్డులు అందజేసిన మంత్రి వారిని సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరణి కందప్ప మేస్త్రీ వంటి మహనీయుడి పేరుతో నడుస్తున్న సత్రంలో ప్రజలకు ఉపయోగపడే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంతపేట రద్దీ ప్రాంతం కావడంతో ప్రతిరోజూ వేలాది మంది పాదచారులు, వ్యాపారులు, విద్యార్థులు, సెంట్ జోసెఫ్ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు ఉచితంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. గంటకు వెయ్యి లీటర్లు, రోజుకు ఐదువేల లీటర్ల వరకు శుద్ధి చేసిన తాగునీటిని అందించే ఈ ప్లాంట్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. సమాజ సేవ లక్ష్యంగా ఆరణి కందప్ప మేస్త్రీ సత్రాన్ని ఏర్పాటు చేయడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. 1972లో దేవాదాయ శాఖలో విలీనమైన తర్వాత కూడా సత్రం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని, ప్రతి ఏడాది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.14 వేల కోట్లతో మంచినీటి ప్రాజెక్టులు, రూ.28 వేల కోట్లతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించడమే లక్ష్యమని, 2029 నాటికి జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం, ధార్మిక సంస్థలు, సేవా సంస్థలు కలిసి పనిచేస్తే సమాజంలో మరింత మంచి మార్పు తీసుకురావచ్చని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, టీడీపీ నేతలు పుట్టా అజయ్, ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

**•పాలక మండలికి మంత్రి సూచన**





**నెల్లూరు, జూలై 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
నెల్లూరు నగరంలోని 125 సంవత్సరాల చరిత్ర కలిగిన సంతపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సతీమణి రమాదేవితో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
నూతన పాలకమండలి చైర్మన్ ముప్పాళ్ల విజేతా రెడ్డి, సభ్యులు శివ ప్రదీప్, జీత్ సింగ్, చైతన్య, విజయ్‌కుమార్, లతేష్, శిల్పా, శిరీషాతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులను మంత్రి దంపతులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 125 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పవిత్ర క్షేత్రం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ ముప్పాళ్ల విజేతా రెడ్డి, సభ్యులు స్వామివారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. 1891లో ఆలయ నిత్య నైవేద్యాల కోసం భూదానం చేసిన రంగారావు, జింక వాహనోత్సవం కోసం తన ఇంటిని దానం చేసిన ములుమూడి సుబ్బమ్మ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. వారి త్యాగస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. రహదారి కంటే మూడు అడుగుల లోతులో ఉన్న ఆలయాన్ని 2017లో భక్తుల సహకారంతో తొమ్మిది అడుగుల ఎత్తుకు పెంచి పునర్నిర్మించడం చారిత్రక ఘట్టమని మంత్రి అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే పల్లకీ సేవ, శ్రీరామనవమి సందర్భంగా జరిగే తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు, హనుమజ్జయంతి, చైత్ర శుద్ధ పౌర్ణమి రథోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాలకమండలి సేవాభావంతో పనిచేయాలని సూచించారు.ప్రతి ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆంజనేయస్వామి భక్తికి ప్రతిరూపం, ధైర్యానికి ప్రతీక, సేవకు నిదర్శనమని పేర్కొంటూ, ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమాజంలో ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం మరింత పెరుగుతాయని అన్నారు. నూతన పాలకమండలి ఆలయ అభివృద్ధితో పాటు ధార్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించి ఈ క్షేత్రానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, టీడీపీ మహిళా నేత కపిర రేవతి, బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, టీడీపీ నేతలు కిన్నెర ప్రసాద్, డీవీఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా -

**- ప్రజాస్వామిక శక్తుల విజయం**
**- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న**



**రాయచోటి,జనసముద్రం న్యూస్ జూలై 26:**
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామిక శక్తులు, విద్యార్థి--యువజన ఉద్యమాల విజయమని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి డైట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.
నీట్ లీకేజీ కేసులో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, దర్యాప్తులో ఐఏఎస్ అధికారులతో సహా ఎవరైనా ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిని కూడా పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ముందుగానే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసి ఉంటే దేశవ్యాప్తంగా నెలకొన్న ఆందోళనలు, విషాదకర పరిణామాలు నివారించే అవకాశం ఉండేదన్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా సాగించిన ఉద్యమాల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం పారదర్శకమైన, నిష్పక్షపాతమైన విద్యా విధానాన్ని అమలు చేయాలని, ఢిల్లీలో నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మహేష్, మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక ఆదాయానికి పండ్ల తోటల పెంపకం శ్రేయస్కరం ఎమ్మెల్యే నెలవల. విజయశ్రీ

**నెల్లూరు, జులై 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి**
వర్షా బావ పంటలగా, దీర్ఘకాలిక ఆదాయాన్ని సమకూర్చే పండ్ల తోటల పెంపకం శ్రేయస్కరమని ఎమ్మెల్యే విజయ శ్రీఅన్నారు. దొరవారి సత్రం మండల పరిధిలోని తల్లంపాడు పంచాయతీలో గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖలు సంయుక్తంగా ఏర్పాటుచేసిన వికసిత్ భారత్- గ్రామ్ రోజ్ గార్ ఆ జీవక్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమం కింద పండ్ల తోటల పెంపకం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జామ పండ్ల తోటల పెంపకం కింద మొక్కలు నాటారు.125 రోజులు ఉపాధి హామీ, రైతుల ఆదాయ



వృద్ధి, హరిత అభివృద్ధి వంటి లక్ష్యాలను అమలు చేస్తుందన్నారు. నీటి వనరులు లేక నిరుపయోగంగా ఉన్న బీడు భూములున్న రైతులు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా కల్పిస్తున్న పండ్లతోటల పెంపకానికి మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఉపాధి హామీ పథకంపి. పి. ఓ, పలు శాకల అధికారులు, పొదుపు సంఘాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం...

## గాలికి పచ్చదనం, శానిటైజేషన్...



గార్డెన్ సిబ్బంది వాటర్ పోస్తున్న దృశ్యాం.



రోడ్డు డివైడర్ మీద ఎండిపోతున్న మొక్కలు.

**అనుభవం లేని వ్యక్తికి పెద్దపీట.. ద్వారకాతిరుమల ఆలయంలో విచిత్ర పరిస్థితులు.**

జన సముద్రం న్యూస్ /జూలై 26/ ఏలూరు జిల్లా ప్రతినిధి రమేష్ .

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. అయితే, భక్తులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు మరియు పారిశుధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ పరిసరాల్లో పచ్చదనం కనుమరుగవుతుండగా, శానిటైజేషన్ పనులను పూర్తిగా గాలికి వదిలేశారనే ఆరోపణలు భక్తుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. పద్మావతి వ్యవస్థ పనితీరుపై గతకాలంగా ఎన్నో ఫిర్యాదులు వస్తున్నా, మీడియాలో వరుస కథనాలు ప్రచురితమవుతున్నా ఆలయ అధికారులు



మాత్రం మొద్దునిద్ర వీడటం లేదనే విమర్శలున్నాయి. టెండర్ మేనేజర్ వ్యవహారశైలిపై ఎన్ని కంప్లైంట్లు వచ్చినా, ఆయనపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీన వైఖరి కారణంగానే ఆలయంలో సమస్యలు పేరుకుపోతున్నాయని మండిపడుతున్నారు. తెలంగాణ నుంచి సపతి శిల్పాలకు డిజైన్లు తయారు చేయించే నిమిత్తం ఆలయ అధికారులు చిరంజీవి ఆదిత్య అనే వ్యక్తిని తీసుకువచ్చారు. అయితే, అనివేటి మండపం పనులు పూర్తిగా ముగిసినప్పటికీ, ఆ వ్యక్తిని అక్కడి నుంచి పంపకుండా గార్డెన్ మెయింటెనెన్స్ పేరుతో కొనసాగించడం పట్ల తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి.సదరు వ్యక్తిపై తీవ్రస్థాయిలో మహిళా సిబ్బంది పట్ల అత్యంత అమర్యాదకరంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు విమర్శలున్నాయి.గార్డెన్ పనుల్లో ఉండే కార్మికులపై ఇష్టం వచ్చినట్లు అరవడం, వేధించడం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.విధుల్లో ఉండగా గార్డెన్ సిబ్బందిని తన సొంత వ్యక్తిగత అవసరాలకు, పనులకు వినియోగించుకుంటున్నారు.

ఇలాంటి అనేక ఆరోపణలు వస్తున్నప్పటికీ, కొందరు ఆలయ అధికారులు అతనికి పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, ఆ వ్యక్తిని రెగ్యులర్ పోస్ట్ కింద పూర్తిగా ఆలయంలోనే కొనసాగించేందుకు కొన్ని ఫైళ్లు సిద్ధం చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో మరియు ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాలి.జనసముద్రం న్యూస్' పత్రికలో వస్తున్న వరుస కథనాలపై సదరు వ్యక్తి అత్యంత దురుసుగా స్పందించినట్లు తెలుస్తోంది. పత్రికను కించపరిచే విధంగా, "జనసముద్రం న్యూస్ కథనాలతో పేపర్ లో రాసుకుంటే మమ్మల్ని ఏమి పీకుతారు" అంటూ విలేకరులను, పత్రికను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తీవ్ర ఆరోపణలున్నాయి. ఈ వ్యక్తిపై తెలంగాణ ప్రాంతంలోనూ పలు ఆరోపణలు ఉన్నట్లు సమాచారం కాగా, దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో రాబోయే రోజుల్లో మరిన్ని సంచలన కథనాలు ప్రచురించనున్నాము.ఈ వ్యవహారంపై ఆలయ ఇంజనీరింగ్ సెక్షన్ ఈఈ భాస్కర్ను వివరణ కోరగా వారు స్పందించారు. ఆలయంలో ప్రస్తుతం 40 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. భక్తులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీరు అందించేందుకు కొంతమంది గార్డెన్ సిబ్బందిని ఆ పనులకు మళ్లించినట్లు చెప్పారు. అయితే, గార్డెన్ నిర్వహణకు సంబంధించి పత్రికల్లో వస్తున్న కథనాల్లోని అంశాలు వాస్తవమేనని అంగీకరించారు. త్వరలోనే అన్ని లోపాలను ఒక్కొక్కటిగా సరిదిద్ది, భక్తులు మెచ్చుకునే విధంగా ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

# దుర్గంపాటి శ్రావణి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ.

**•ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్**

నెల్లూరు, జులై 26, జన సముద్రం జిల్లా ప్రతినిధి



వింజమూరు మండలం, పాతూరు పరిధిలోని రజక బజార్కు చెందిన దుర్గంపాటి శ్రావణి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 82,662/- విలువైన ఎల్.ఓ.సి. చెక్కును ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన ప్రతి కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

వైద్య చికిత్స కోసం మంజూరైన ఈ ఆర్థిక సహాయం కుటుంబానికి ఎంతో ఊరటనిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అలాగే తమ సమస్యను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పినపాక మండల ఎంపీఓగా వెంకటేశ్వరరావుకు బాధ్యతలు.

**ప్రజల మదిలో చెరగని ముద్ర...**
**ఆక్రమణదారుల గుండెల్లో నిద్ర...!**
**పినపాకకు మళ్లీ 'వెంకటేశ్వరరావు' మార్క్ పాలనచేసిన సేవలే చిరునామా...!**
**అభివృద్ధి ప్రదాత పునరాగమనంపై పినపాకలో హర్షాతిరేకాలు.**

జనసముద్రం న్యూస్, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జులై 26.

పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీఓ) గా వెంకటేశ్వరరావు మరలా బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో పినపాక మండలంలో ఎంపీఓగా పనిచేసిన కాలంలో ఆయనందించిన విశిష్ట సేవలు, ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణలో చూపిన ప్రతిభ మండల ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. గ్రామాల రూపురేఖలు మార్చడంలో, పారిశుధ్య లోపం లేకుండా నిరంతరం శ్రమించడంలో ఆయన చూపిన



చొరవతో ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఆయన సొంతం. గతంలో ఆయన హయాంలో పినపాక మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు , ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు జరిగాయి. వీధుల పరిశుభ్రత, డ్రైనేజీల పూడికతీత, మొక్కల పెంపకం, రహదారుల వెడల్పు, గ్రామ పంచాయతీల సమర్థవంతమైన నిర్వహణలో వెంకటేశ్వరరావు తనదైన ముద్ర వేశారు. కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య కార్మికులకు దిశా నిర్దేశం చేస్తూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేవారు.



**- వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు...!**

ఆయన మరలా పినపాక ఎంపీఓగా బాధ్యతలు చేపడుతున్నారని తెలిసిన వెంటనే మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "మంచి మనసుతో మండల అభివృద్ధికి, ప్రజారోగ్యానికి రాత్రింబవళ్లు కష్టపడిన అధికారి మళ్లీ మన పినపాకకు రావడం నిజంగా శుభపరిణామమని చర్చించుకుంటున్నారు. ఎంపీఓ తిరిగి రాకతో పినపాక మండలంలో పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీ వేగవంతం అవుతాయని స్థానికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ బడుల్లో ఐఐటి చదువులు.

- చేతికి ఉచిత సైకిళ్లు పొంగూరు షరణి
- మా నాన్న చదివిన బడిలోనే,పేద పిల్లల రవాణా కష్టాలకు చెక్. 6 కోట్లు పార్టీది కాదు.
- నెల్లూరు ప్రజలపై మాకున్న ప్రేమ పొంగూరు షరణి ఆడపిల్లల కష్టాలు చూశాను
- నడకలకు గుడ్‌బై, సైకిళ్లకు వెల్‌కమ్ మాట ఇచ్చాం. నిలబెట్టుకున్నాం.10,000 సైకిళ్లతో గ్రాండ్ ఎంట్రీ పిల్లలతో సరదాగా సైకిల్ తొక్కిన షరణి
- విఆర్సి స్కూల్‌లో మాస్ హంగామా



నెల్లూరు, జూలై 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.



నెల్లూరు నగరంలో పేద విద్యార్థుల చదువుకు, రవాణా సౌకర్యానికి కొండంత అండగా నిలిచేందుకు నారాయణ విద్యా వాహనం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు షరణి చారిత్రాత్మక వి ఆర్ సి పాఠశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి చదువుల గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా, వారిలో ఉత్సాహం నింపేందుకు స్వయంగా సైకిల్ తొక్కి సందడి చేశారు. నెల్లూరు నియోజకవర్గంలోని 23 ప్రభుత్వ, మున్సిపల్ హైస్కూళ్ల విద్యార్థుల కోసం సుమారు 6 కోట్ల సొంత నిధులతో, రెండు విడతల్లో మొత్తం 10,000 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 4:00 గంటలకు విఆర్సిగ్రౌండ్‌లో జరిగే తొలి విడత కార్యక్రమంలో 7,000 సైకిళ్లను అందజేస్తున్నామని, రాబోయే దసరా పండుగ కానుకగా రెండో విడతలో మిగిలిన 3,000 సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.?గతంలో హరనాథపురం వంటి దూర ప్రాంతాల నుండి వి ఆర్ సి పాఠశాలకు రాకపోకలు సాగించడానికి కాలినడకన 40 నిమిషాలకు పైగా ప్రయాణించాల్సి వచ్చేదని, దీనివల్ల పిల్లలు తీవ్ర అలసటకు, ఒత్తిడికి గురయ్యేవారని షరణి గుర్తుచేశారు. ముఖ్యంగా ఆడపిల్లలను రోడ్లపై నడిపించి స్కూళ్లకు పంపడానికి తల్లిదండ్రులు పడే భయాన్ని గమనించి, వారి రవాణా కష్టాలు తీర్చడానికే ఈ సైకిళ్ల పంపిణీ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. పార్టీ లేదా ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, నెల్లూరు ప్రజలపై ఉన్న అభిమానంతో తమ కుటుంబం పక్షాన ఈ వ్యయాన్ని ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకప్పుడు కనీస వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలను అధునాతన మౌలిక వసతులు, నిపుణులైన ఉపాధ్యాయులతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడమే కాకుండా, 9వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఒలింపియాడ్, ఐఐటి ఫౌండేషన్ శిక్షణ కూడా అందిస్తున్నామని తెలిపారు. వీధి వీధి తిరుగుతున్నప్పుడు విద్యార్థుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు చేపట్టిన ఈ విప్లవాత్మక కార్యక్రమం నెల్లూరు విద్యా రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్,టీడీపీ నాయకులు జహీర్,బాలాజీ,తిరుమల నాయుడు,మైనుద్దీన్, దర్శి హరికృష్ణ, అశోక్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీలు.

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 26 జంగారెడ్డిగూడెం.

జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లిలోని ఎర్రకాలువ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీలు అత్యంత ఉత్సాహంగా, ఘనంగా ఆదివారంతో ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ స్పెల్లింగ్ అండ్ డ్రాయింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ తరుణ్ కాకాని మరియు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి క్రీడాకారులు పెద్దఎత్తున తరలివచ్చి తమ సత్తా చాటారు.ఈ ముగింపు వేడుకలకు పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి, డిస్ట్రిక్ట్ డి ఎస్ డి ఓ అజీజ్, రోయింగ్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ తరుణ్ కాకాని, డిస్ట్రిక్ట్ రోయింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ ఊదర్ల జోషి, స్టేట్




రోయింగ్ సెక్రెటరీ శ్రీ పవన్, చక్రదేవరపల్లి సర్పంచ్ ఉ రోయింగ్ స్టేట్ చీఫ్ కోచ్ మూర్తి, జాతీయస్థాయి రోయింగ్ క్రీడాకారుడు ఊదర్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు అధికారులు, నాయకులు, క్రీడాకారులు మరియు వారి తల్లిదండ్రులు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రోయింగ్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ తరుణ్ కాకాని మరియు స్టేట్ రోయింగ్ చీఫ్ కోచ్ కృష్ణమూర్తి




మాట్లాడుతూ.. రానున్న జాతీయ స్థాయి రోయింగ్ పోటీలను దృష్టిలో ఉంచుకుని ఈ రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రోయింగ్ క్రీడను మరింత అభివృద్ధి చేయడానికి, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడానికి తాము నిరంతరం శ్రమిస్తున్నామని వారు స్పష్టం చేశారు.

# ఘనంగా కుంజా సూర్యారామ్ పుట్టినరోజు వేడుకలు

జన సముద్రం న్యూస్ రిపోర్టర్ గంగారం మండలం జూలై 26.

మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ రోజు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ ధనసరి సీతక్క తనయుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రెటరీ కుంజసూర్య పుట్టినరోజు సందర్భంగా వారిని ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ముడిగ వీరభద్ర పోతయ్య మాట్లాడుతూ.కుంజ సూర్యారాం తల్లి సీతక్క సేవాస్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని నియోజకవర్గంలోని యువకులు క్రికెట్ కబడ్డీ వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తే స్వయంగా హాజరై యువతను ప్రోత్సహించి బహుమతులు అందిస్తున్నారని పెళ్లిళ్లు దశదినకర్మలు ప్రతి కార్యక్రమానికి హాజరై ప్రజలలో తనదైన శైలిలో నిలుస్తున్నారని ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. సూర్యారాం



రాజకీయంగా మరింత ఎదిగి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు మాజీ ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు మాజీ జడ్పిటిసి ఈసం రమ సురేష్.మాజీ యూత్ అధ్యక్షులు ముడిగ విజయ్ కుమార్ మరియు పార్టీ నాయకులు సాంబయ్య అశోకు సురేష్ సీతక్క అభిమానులు పాల్గొన్నారు

# మట్టి ఖర్చులు నిమిత్తం 15000/- ఆర్థిక సహాయం అందజేసిన వజ్రం నాయక్

జనసముద్రంన్యూస్,మాచర్ల, పల్నాడు జిల్లా, జూలై 26;



మాచర్ల పట్టణం లోని తొమ్మిదవ వార్డుకు చెందిన కేతావత్ రంగా నాయక్ మరణించడం జరిగింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మరియు జూలకంటి గౌతమ్ రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్ మట్టి ఖర్చుల నిమ్మితశీ 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

# చిట్టిబాబుగా వెంకటేశ్.. 'ఆదర్శ కుటుంబం' ఇదే




వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం.47' . శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీకి సంబంధించి చిత్ర బృందం ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకుంది. 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడానికి సిద్ధమైంది. జులై 27న స్పెషల్ అప్‌డేట్‌ను పంచుకోనుంది. ఈ సందర్భంగా కీలక నటులు ఏయే పాత్రల్లో కనిపించనున్నారో తెలియజేసింది. ఇందులో చిట్టిబాబు అనే పాత్రలో ఇద్దరు బిడ్డల తండ్రిగా వెంకటేశ్ నటిస్తున్నారు. స్వర్ణగా శ్రీనిధి శెట్టి, సంపూర్ణగా యువిన పార్వతి, శర్వాగా రాజ్ ప్రజ్వల్ నటిస్తున్నారు. జులై 27న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది. అక్టోబరు 2న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాత నాగవంశీ తెలిపారు. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వెంకటేశ్ మధ్యతరగతి కుటుంబ పెద్దగా కనిపించనున్నారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాకోసం ఎదురు చూసిన ప్రేక్షకులకు 'ఆదర్శ కుటుంబం'తో ఆ కల నెరవేరనుంది.

## ఆ హిట్ తర్వాతే నాపై నమ్మకం పెరిగింది: అదా శర్మ

'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు అందాల తార అదా శర్మ. భారీ హిట్ కొట్టిన తర్వాత హీరోయిన్లకు మంచి పాత్రలు దక్కవనే ప్రచారంలో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆ సినిమా విజయంతోనే తనకు మరిన్ని మంచి అవకాశాలు వస్తున్నాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. "ఒక హిట్ పడితే.. మన నటనపై అందరికీ నమ్మకం పెరుగుతుంది. భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు ఇస్తారు. ప్రస్తుతం ప్రతి నటి కోరుకునే డ్రీమ్ రోల్స్ నాకు వస్తున్నాయి. సవాలుతో కూడిన, విభిన్నమైన పాత్రలు దక్కుతున్నాయి" అని చెప్పారు.చిట్టిబాబుగా వెంకటేశ్.. 'ఆదర్శ కుటుంబం' ఇదే 2008లో '1920' అనే హిందీ హారర్ సినిమాతో అదా శర్మ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. టాలీవుడ్‌లో 'హార్ట్ ఎటాక్', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'క్షణం' లాంటి హిట్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే బాలీవుడ్ చిత్రం 'హసీ తో ఫసీ'తో పాటు, విద్యుత్ జమ్వాల్ 'కమాండో' సిరీస్‌లోనూ ఆకట్టుకున్నారు. ఇటీవల మనోజ్ బాజ్‌పాయ్‌తో కలిసి 'గవర్నర్' అనే మూవీలో నటించారు. చిన్మయ్ డి.మాండ్లేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. 1990 నాటి భారత ఆర్థిక సంక్షోభం, ఆర్బీఐ–ప్రభుత్వం మధ్య జరిగిన పరిణామాల నేపథ్యంతో తెరకెక్కింది. మరోవైపు, ఆమె 'గజ్రా' అనే చిత్రంతో మరాఠీ పరిశ్రమలోకి అడుగుపెట్టనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా శ్రేయాస్ జాదవ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## యశ్‌కి నేను పెద్ద అభిమానిని: రణ్‌బీర్ కపూర్





యశ్‌కి తాను పెద్ద అభిమానినని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. 'రామాయణ' లో రావణుడి పాత్రలో యశ్ ఒదిగిపోయిన తీరుపై ప్రశంసలు కురిపించారు. అలాగే, వీరిద్దరి మధ్య వచ్చే కీలకమైన క్లైమాక్స్ సన్నివేశాల షూటింగ్ ఇంకా జరగలేదని వెల్లడించారు. "రామాయణ' సినిమా చివర్లో రాముడు, రావణుడు ఇద్దరూ ఒకరికొకరు ఎదురుపడే సన్నివేశాలు ఉంటాయి. అవి మేం ఇంకా చిత్రీకరించలేదు. ఎప్పటినుంచో నేను యశ్ కు చాలా పెద్ద అభిమానిని. రావణుడి పాత్రలో ఆయన ఒదిగిపోయిన తీరు నాకేంతో నచ్చింది. ఇప్పటివరకు మనం చూసిన రావణుడి పాత్రలకు భిన్నంగా యశ్ ఈ పాత్రను పోషిస్తున్నారు. తనదైన స్వాగ్, ఆరా, నిజాయితీతో రావణుడి పాత్రకు ప్రాణం పోశారు. ఇది ఇంతకుముందు రావణుడి పాత్రలా అస్సలు ఉండదు" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి యశ్ మాట్లాడుతూ.. "అద్భుతమైన కథను సరైన విధానంలో ప్రేక్షకులకు చూపించడానికే మా బృందం ప్రయత్నిస్తోంది. సరైన బృందం ఉంటే అన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి. మేకప్, లుక్స్, సాంకేతికత పరంగా ఈ సినిమా కోసం మేం ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. ఇదొక అద్భుతమైన కథ. దీన్ని అత్యంత సహజంగా మీ ముందుకు తీసుకురావడానికి మా వంతు కృషి చేస్తున్నాం " అని పేర్కొన్నారు.ఇక, నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎంతోమంది ప్రముఖ నటీనటులు భాగమయ్యారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీదేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక, 'రామాయణం పార్ట్ 1' ఈ ఏడాది దీపావళికి విడుదల కానుండగా.. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'శ్రీనివాస మంగాపురం'.. ఆల్ ది బెస్ట్ చెప్పిన మహేశ్ బాబు



అగ్ర నటుడు మహేశ్‌బాబు 'శ్రీనివాస మంగాపురం' చిత్రబృందానికి ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. చాలా సంతోషంగా ఉందంటూ ఒక వీడియో పోస్ట్ చేశారు. "చాలా ఆనందంగా ఉంది. జయకృష్ణ హీరోగా నటిస్తున్న ఈ సినిమా కోసం మా కుటుంబమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ మూవీ ట్రైలర్, పాటలు బాగున్నాయి. అజయ్ భూపతికి ఈ క్రెడిట్ దక్కాలి. నటీనటులను ఆయన అంత బాగా చూపించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ చక్కటి సంగీతాన్ని అందించారు. అందులో నాకు 'అలెల్లే అలెల్లే' పాట బాగా నచ్చింది. నేను, అల్లు అర్జున్, రామ్‌చరణ్ మేమంతా వైజయంతి బ్యానర్‌పైనే పరిశ్రమలో అడుగుపెట్టాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ ద్వారా జయకృష్ణ వెండితెరకు పరిచయమవుతుండటం సంతోషంగా ఉంది. అభిమానులు జయకృష్ణని, రషాని ప్రోత్సహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మొత్తం చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ " అని మహేశ్ వీడియోలో పేర్కొన్నారు. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా, అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రషా థడానీ కథానాయిక. ఈ మూవీ జులై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నటుడు రమేశ్ కుటుంబానికి అండగా నిలిచిన చిరంజీవి




హైదరాబాద్: తోటి కళాకారులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునేందుకు ముందుండే ప్రముఖ నటుడు చిరంజీవి మరోసారి పెద్ద మనసు చాటారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న నటుడు రమేశ్ కుటుంబానికి అండగా నిలిచారు. 'గబ్బర్ సింగ్'తో పాటు పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన నటుడు రమేశ్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న చిరంజీవి అపోలో ఆసుపత్రి డాక్టర్ సుబ్బారెడ్డితో మాట్లాడి రమేశ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. చికిత్సకు అవసరమైన సాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన.. చికిత్స ఖర్చులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో అతని సతీమణికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా అవసరమైన సహాయం అందేలా సిఫార్సు చేస్తామని చిరంజీవి హామీ ఇచ్చారు. చిరంజీవి సోదరుడు నాగబాబు తన వంతు సాయంగా రమేశ్ కుంటుంబానికి రూ.2లక్షల చెక్కును అందించారు. రమేశ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని చిరంజీవి ఆకాంక్షించారు.

## 'బేబి'కంటే గొప్పగా చెన్నై లవ్‌స్టోరీ



"సినిమా బాగుంటుందని నేను చెప్పిన ప్రతిసారీ ప్రేక్షకులు నమ్మి థియేటర్‌కి వస్తున్నారు. 'చెన్నై లవ్‌స్టోరీ' ముందస్తు ప్రదర్శనలు మొదలుకొని హౌస్‌ఫుల్ బోర్డులతో ప్రదర్శితం అవుతుండడం చూశాక ఎంతో ఆనందం కలుగుతోంది" అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా, రవి నంబూరి తెరకెక్కించిన 'చెన్నై లవ్‌స్టోరీ' శుక్రవారమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా కథానాయకుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "మా ప్రేమకథపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు. ప్రతి ప్రేమకథ ఒకేలా ఉంటే చరిత్రకు కూడా నచ్చదు. మాది కొత్త ప్రేమకథ. కుటుంబంతో కలిసి సినిమాని ఆస్వాదించాలని కోరుతున్నా. ఇందులోని నివి పాత్రకి అందరూ కనెక్ట్ అవుతున్నారు. నేను పోషించిన స్టీవెన్ శంకర్ పాత్ర గురించీ అందరూ గొప్పగా చెబుతుంటే ఆనందంగా ఉంది" అన్నారు. శ్రీగౌరీప్రియ మాట్లాడుతూ "సింగిల్ స్క్రీన్స్‌లోనూ, మల్టీప్లెక్స్‌ల్లోనూ ఒకే రకమైన స్పందన కనిపిస్తోంది. అన్ని వయసులవాళ్లూ థియేటర్లలో కనిపిస్తున్నారు. ప్రేక్షకులందరినీ ఒక్కటి చేసేదే మంచి సినిమా అనిపించింది" అన్నారు.దర్శకుడు మాట్లాడుతూ "తొలి సినిమాతోనే ఘన విజయం అనేది ప్రతి దర్శకుడూ కనే కల. అది సాకారమైనందుకు ఎంతో ఆనందం కలుగుతోంది" అన్నారు. కథా రచయిత, చిత్ర నిర్మాతల్లో ఒకరైన సాయిరాజేశ్ మాట్లాడుతూ "ఒక మంచి సినిమాకి అన్నీ కలిసొస్తాయని మరోసారి రుజువైంది. నేను కథా రచయితనైనా నాకంటే బాగా ఈ కథని అర్థం చేసుకుని తెరకెక్కించాడు రవి నంబూరి. 'బేబి' తర్వాత మా గౌరవాన్ని పెంచే సినిమానే చేయాలనుకున్నాం. దానికంటే గొప్ప సినిమాని చేశామ"న్నారు.మరో నిర్మాత ఎస్.కె.ఎన్.మాట్లాడుతూ "కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదనే అభిప్రాయాల్ని వింటుంటాం. మంచి కథ, సరసమైన టిక్కెట్ ధరలు ఉంటే కుటుంబ ప్రేక్షకులు, యువతరం సినిమాలకు బ్రహ్మరథం పడతారని మరోసారి మా సినిమా రుజువు చేసింది" అన్నారు. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని, నటులు త్రిగుణ్, ప్రమోదిని, మహేందర్, గీత రచయిత అనంతశ్రీరామ్, ఛాయాగ్రాహకుడు విశ్వాస్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకథ రాయనున్న సూపర్‌స్టార్.. సినిమాగా కూడా రానుందా?



సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు ఓ శుభవార్త. ఆయన తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారని నెట్టింట వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఆయన బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా, రజనీకాంత్ కొంతకాలంగా ఈ పుస్తకం రాసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. కేవలం పుస్తకమే కాకుండా, ఈ ఆత్మకథను సినిమాగా (బయోపిక్) కూడా తీసుకురావాలని ఆయన భావిస్తున్నారట. ఈ ఆలోచనపై తనకు అత్యంత సన్నిహితులైన వారితో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, పుస్తకం లేదా సినిమాపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.ఇక, రజనీకాంత్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జైలర్ 2' చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 15న విడుదల కానుంది. ప్రస్తుతం 'ధర్మన్' మూవీ షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు.